అమరావతి శతకథామంజరిలో ఇది 91వ కథ!

# అమరావతి కథలు

సత్యం శంకరమంచి



## భోజనాంతే....

అది బ్రాహ్మణ వీధి.

పున్నయ్యగారి పొలం మాదిగ కోటాయి పాలుకి చేస్తున్నాడు. అప్పట్లో వారినలాగే అనేవారు. పున్నయ్యగారిల్లు కృష్ణవొడ్డున, గుడికి పడమట. కోటాయి పున్నయ్యగారితో సలహా సంప్రతింపులకు రావాలంటే మహా ఇబ్బందిగా ఉండేది. బ్రాహ్మణ వీధిలో నడవటానికి వీల్లేదు గదా! మడి, ఆచారం, తడిబట్టలతో నీళ్ళు తెచ్చుకోటాలు, వీధరుగులమీద వేదం చెప్పుకుంటూ జంధ్యాలు వడుక్కోటాలు, పట్టుబట్టలతో గుళ్ళోకి వెళ్ళటాలు – ఇవన్నీ ఉన్నాయి కదా! ఇవన్నీ ఉన్నప్పుడు కోటాయి ముఖదర్శనమే పనికిరాదుగదా! అలాంటప్పుడు ఆ వీధిలోకి రావడమెలా సాధ్యం?

అసలీ బాపనాయనకి, మాదిగాయనకి ఈ సంబంధ మేవిటి? పున్నయ్యగారి తాతకి కోటయ్యతాత పొలం చేసేవాడు.

పున్నయ్యగారిని పున్నయ్యగారన్నాం కదా, ఆ నోటితో కోటాయినికూడా కోటాయిగారు అంటే ఏంపోయిందో?

పోన్లెద్దురూ! గారు వల్ల వారిగేదేముంది– ఆ వారిగేదేదో వార్నే పంచుకోనివ్వండి.

ఇంతకీ పున్నయ్యగారికి కోటాయితో మాట్లాడానికి, కోటాయి వారింటికి నడవడానికి దోవ లేకపోయింది. అంచేత పున్నయ్యగారు కృష్ణవైపు దొడ్డిగోడ పగలగొట్టించి అక్కడ ఓ ద్వారం ఏర్పాటు చేశారు. గుళ్లో దేవుడెలా ఉంటాడో తెలియని కోటాయి గుడి ప్రాకారం చుట్టివచ్చి కృష్ణ వొడ్డుగా నడిచి పున్నయ్యగారి దొడ్లోకి వచ్చేవాడు. కోటాయి కోసం ప్రత్యేకంగా పెట్టించిన వాకిలి కనుక అది 'కోటాయి వాకిలి' అయింది. 'అలా కోటాయి వాకిట్లోంచి వెళ్ళి రత్తమ్మగారింట్లో కరివేపాకందుకో' అనటం అలవాటయింది.

కోటాయి పున్నయ్యగారి దొడ్లో కుడితి గాబు పక్కన కూర్చున్నాడు. నల్లగా బుర్రమీసాలు. మోకాటిపైకి పంచె. పున్నయ్యగారు కొట్టంలో గుంజకానుకుని కూర్చున్నారు. లెక్కలు డొక్కలు చూసుకోటానికి ముందు పున్నయ్యగారు కుటుంబ సమాచారాలు మాట్లాడతాడు.

"వరదాయిని చదువులో పెట్టావా?"

"సదువులో పెట్టే పొలవో! – రెక్కాడితేగాని డొక్కాడనోళ్ళం మాకు సదువెందుకయ్యా!"

"ఓరే చినకోటాయిది పెద్ద సంసారం ఎట్లా ఈదుకొస్తున్నాడో?"

ఒకటే ఈత. ఓ పూట గంజి, ఇంకో పూట పస్తు.

"వీరెంకాయికి చూపు తగ్గిపోతోం దేరా?"

"అది పనయిపోయిందిలెండి."

ఆ పైన లెక్కలు చూసుకున్నారు. పున్నయ్యగారు కాగితంమీద లెక్కలేస్తే, కోటాయి మనసులోనే లెక్కకట్టేవాడు. అరగంటసేపు కూడికలు, తీసివేతలు వేసి పున్నయ్యగారు ఓ అంకె చెప్తే అంతకు అయిదు నిమిషాలముందే ఆ అంకె చెప్పేవాడు కోటాయి. పున్నయ్యగారు ఆశ్చర్యపోయి "నువ్వు చదువుకుంటే ఎంత పెద్దోడివయ్యేవాడివోరా! అంటే కోటాయి చిత్రంగా నవ్వి 'మా అయ్యకి పలకెట్టగుంటదో తెలియదు. ఇంక సదువు మాటేటి మా బతుకులిట్టా ఎల్లిపోతే అదే సాలు అనేవాడు.

ఎప్పుడూ కోటాయే బాకీ తేలేవాడు. ఎప్పుడూ బాకీ పూర్తిగా ఇవ్వలేకపోయేవాడు. పున్నయ్యగారు గింజుకుని, కసురుకుని, అరిచి ఆఖరికి 'సరే' అని సర్దుకునేవాడు. ప్రతి సంవత్సరం ఇది మామూలే.

కోటాయి వెళ్ళిపోయిం తర్వాత ఆడవాళ్ళు అతను కూర్చున్న చోట ఆవుపేడ కల్లాపిచల్లి శుద్ధి చేసేవారు.

ఇరవై ఏళ్ళు గడిచాయి.

కోటాయి ఇప్పుడు బ్రాహ్మణవీధిలోంచి నడిచి పున్నయ్యగారి ముందు గుమ్మంలోంచి ఇంటి వసారాలో కొచ్చి కూర్చుంటున్నాడు. పున్నయ్యగారు సరాసరి గూడెంలోని బావిదగ్గరకెళ్ళి కోటాయిని పిలుస్తున్నాడు. వెనక క్రిష్ణకెళ్ళి మంచినీళ్లు తాగే కోటాయి పున్నయ్యగారింట్లో చెంబుతో నీళ్ళు తాగి దాహం తీర్చుకుంటున్నాడు. కోటాయి కొడుకులూ, పున్నయ్యగారి కొడుకులూ హైస్కూల్లో ఒకే బెంచీమీద కూర్చుని చదువుతూ "ఒరేయ్!" అని పిలుచుకుంటున్నారు. కలిసి కబాడీ ఆడుతున్నారు. కలసి కాఫీ తాగుతున్నారు.

అయ్యా! అదీ సంగతి.

కథయి పోయిందేమిటి?

మరి కొంచెం ఉంది.

అవధాన్లుగారు బహిరంగంగా నడిబజార్లో కోమటికొట్లో చిట్టిగారెలు తింటున్నారు. చాకలి వీరాయికొడుకు పంచాయితీ ఆఫీసరు చేస్తున్నాడు, అభిషేక బ్రాహ్మలు సాయంత్రాలు పాంటు షర్ట్ వేస్తున్నారు. అర్చకులు హిప్పీ క్రాపులు, కటింగు మీసాలు పెట్టారు. ముత్తరాసు పోలయ్య పొగాకు వ్యాపారం చేస్తున్నాడు. పురోహితుడు పొద్దుకూకంగానే మద్యం సేవిస్తున్నాడు. ఒకప్పటి ఇన్‌క్లీనరు లారీలు కొని, ఆ పైన పంచాయితి ప్రెసిడెంట్ అయ్యాడు. హరికథలు పురాణాలు విన్పించటంలేదు. సినిమాకి టిక్కట్టు దొరకటం లేదు. కాలేజి కుర్రాళ్ళు అమ్మాయిల వేటకోసం గుళ్ళోకి పెందరాళే వస్తున్నారు. కట్నం ఇవ్వలేని ఆడపిల్లలకి పెళ్ళిళ్ళు కావటంలేదు. బాకీల తాకట్టు కింద ఇళ్ళు చేతులు మారుతునే ఉన్నాయి. రోజూ సూర్యుడు ఉదయించి కుంకుతూనే ఉన్నాడు. అదీ కథ.

ఇదేమి కథ అంటున్నారా తమరు? అయ్యా! మీకు తీపి తినటం అలవాటయింది. పచ్చడి కూడా రుచే! పైగా తమరు చాదుల్లోకొచ్చేశారు. గమనించండి. ★